సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 30 । మే । 2025



టన్ను చీనీ రూ.34 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు, కనిష్టంగా రూ.4,600 ప్రకారం ధర పలికాయి.



'చిత్రావతి'కి పర్యాటక శోభ

తాడిమర్రి మండల సరిహద్దులోని పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు పర్యాటకుల తాకిడి అధికమవుతోంది.

8లో

గరిష్టం/కనిష్టం

34.6°/21.8°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగినా... ఉక్కపోత తగ్గలేదు. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి సేవలో తెలంగాణ జడ్జి



కుటుంబ సభ్యులతో జడ్జి అరుణకుమారి

కదిరి టౌన్: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ సిటీ సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి, ఆమె భర్త కిశోర్ కదిరి లక్ష్మీ నరసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి వారిని దుశ్శాలువాలతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

రేపు పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: జూన్ నెల ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులు 2,66,986 మందికి రూ.114.86 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఈనెల 31వ తేదీ ఉదయం నుంచి పింఛన్లను పంపిణీ చేస్తారన్నారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో 3 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు మే 31 నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వుల మేరకు జూన్ 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డు కలిగివున్న జర్నలిస్టులకు మాత్రమే పొడిగింపు వర్తిస్తుందని పేర్కొన్నారు.

పక్కాగా ఆయుష్మాన్ భారత్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: 'జిల్లాలో ఆయుష్మాన్ భారత్ స్కీంను పక్కాగా అమలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలి' అని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు జిల్లా అమలు కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ వైద్యశాఖ అధికారి ఆధ్వర్యంలో వైద్యులు, మెడికల్ సిబ్బందితో ప్రతి వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యసేవలపై సమీక్షించాలన్నారు. కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, వారి ఆరోగ్య ప్రయోజనాలు, వైద్య సంరక్షణను ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తోందన్నారు. అనంతరం హిందూపురం పట్టణంలోని బాలాజీ , స్పందన , రాఘవేంద్ర, తేజ ఆస్పత్రుల్లో పీఎంజేఏవై సేవలపై సమీక్షించారు. అలాగే కదిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఫిరోజ్ బేగం, డీసీహెచ్‌ఎస్ మధుసూదన్, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్‌పై విచారణ

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని గురువారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్ సందర్శించారు. ఆస్పత్రిలో 2022లో పని చేసిన ఓ మహిళా డాక్టర్‌పై అప్పట్లో పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన విచారణ జరిపారు. మెడికల్ ఆఫీసర్ శశిరేఖ, ఆర్‌ఎంఓ దివాకర్ విచారణకు హాజరయ్యారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రాథమిక వైద్యం పడకేసింది. కూటమి సర్కారు పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వైద్య రంగం తిరోగమనంలో వెళుతోంది. మందుల కొరత, డాక్టర్లు అందుబాటులో లేకపోవడం నిత్యకృత్యమయ్యాయి. ఇక పేదలకు అపర సంజీవనిగా వెలుగొందిన ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యం కావడంతో ప్రజల కష్టాలు చెప్పనలవిగా మారాయి.

పడకేసిన వైద్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో తాము న్న ప్రాంతంలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు (ఫైల్)

కూటమి.. కనికరం లేమి

- చంద్రబాబు ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్య రంగం కుదేలు
- 104, 108 వాహనాల సేవలకు తీవ్ర విఘాతం
- మందుల కొరతతో అల్లాడుతున్న సామాన్య రోగులు
- ఏడాది పాలనలో ఆరోగ్య రంగం తిరోగమనం

పరిగి మండల వ్యాప్తంగా పరిగి పీహెచ్‌సీలో మాత్రమే గతంలో వైద్య సేవలను అందించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 25 వేల మందికి పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలన్న క్రమంలో ఊటుకూరుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైంది. అధికారులు పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలం కేటాయించారు. అయితే ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నేటికీ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సేవలు అందిస్తున్నారు. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు. అయితే ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టుతో పాటు స్టాఫ్ నర్సులను నియమించలేదు. పీహెచ్‌సీలో ప్రస్తుతం మరుగుదొడ్డి సదుపాయం లేదు. తాగునీరు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పది రోజుల క్రితం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత మందుల పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా కూటమి సర్కారు ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 50 శాతం మంది తమకు మందులు అందడం లేదని చెప్పారు. చాలాచోట్ల యాంటీబయాటిక్స్ లేవు. పాముకాటు మందు లేదు. గర్భిణులకు కాన్పు సమయంలో ఇచ్చే ఇంజెక్షన్లు లేవు. అంతెందుకూ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం ఆస్పత్రిలోనే మందులు లేవు. పీహెచ్‌సీ నుంచి బోధనాసుపత్రి వరకూ మందుల కొరత రోగులను వేధిస్తోంది.

దారుణ పరిస్థితులు..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రక్తపరీక్షలు సరిగా జరగడం లేదు. ఎమర్జెన్సీ మందులు లేవని సిబ్బంది వాపోతున్నారు. చిన్నారులకు ఇచ్చే టీకాలు కూడా సరిగా సరఫరా కావడం లేదని చెబుతున్నారు.

'ఆరోగ్య శ్రీ' నిర్వీర్యం..

2019–24 మధ్య కాలంలో అప్పటి సీఎం జగన్ చొరవతో ఆరోగ్యశ్రీ పథకం కొత్త జవసత్వాలు నింపుకుంది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 3,250 జబ్బులకు ఈ పథకం ద్వారా చికిత్సలు అందించేవారు. అయితే, చంద్రబాబు అధ్యక్షతన కూటమి సర్కారు ఏర్పటినప్పటి నుంచి పథకం ప్రకారం 'ఆరోగ్య శ్రీ'ని నిర్వీర్యం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు రెండు మాసాలకోసారి సమ్మెకు దిగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం త్వరలో 'ఆరోగ్య శ్రీ'ని ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పబోతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వాసుపత్రుల్లో లేని మాత్రలివే..

మందు	ఏ జబ్బుకు
లాల్‌బటాలాల్ 2ఎంఎల్ ఇంజెక్షన్	రక్తపోటు/ హైపర్‌టెన్షన్
పెరిడాక్సిన్‌క్లోరైడ్ 10 ఎంఎల్ ఇంజెక్షన్	నరాల బలహీనత
క్లోటిమాజెల్	గర్భాశయ ఇన్ఫెక్షన్ల నియంత్రణకు
అమినోయాసిడ్ 500 ఎంఎల్ ఇంజెక్షన్	గాయాలు మానడం కోసం
ఫ్లూకనోజోల్ 200 ఎంజీ	అలర్జీ నియంత్రణకు
అమాక్సిలిన్ క్లావిలిక్ యాసిడ్	యాంటీబయాటిక్
బెటమిథోజోన్- 2	స్టెరాయిడ్స్
నైట్రోగ్లైసెరిన్-2	గుండె సంబంధిత వ్యాధులకు

దీంతో భవిష్యత్తులో పథకం పరిస్థితి ఎలా ఉంటుందోనని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

గాల్లో దీపంలా 108, 104 ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందిని ఆపత్కాలంలో ఆదుకున్న 108 అంబులెన్సులు నేడు షెడ్డుకు చేరాయి. అంబులెన్సుల నిర్వహణా సంస్థను మార్చారు. పాత వాహనాలన్నీ రాప్తాడు వద్ద షెడ్డులో పడ్డాయి. కాల్ వెళ్లిన 30 నిమిషాల్లో ఘటనా స్థలికి వెళ్లాల్సిన అంబులెన్సు నేడు గంటకు కూడా రావడం లేదు. ఇక 104 అంబులెన్సులకు కూటమి సర్కారు రాగానే కాలం చెల్లింది. గతంలో నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు, గర్భిణులకు మందులివ్వడంతో పాటు వైద్య పరీక్షలు చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. 104 వాహనాలు పల్లెలకు వెళ్లక ఏడాది అవుతోంది.

పెనుకొండలో మెడికల్ కాలేజీకి గ్రహణం...

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో వైఎస్ జగన్ హయాంలో రూ.375 కోట్లతో మెడికల్ కాలేజీకి పునాది వేశారు. కూటమి సర్కారు వచ్చాక దీన్ని ముందుకు కదలనివ్వలేదు. ఉమ్మడి జిల్లా అంతటికీ కలిపి ఇప్పటికీ 'అనంత'లో ఒక్కటే మెడికల్ కళాశాల ఉంది. కొత్త కాలేజీ వస్తే శ్రీ సత్యసాయి జిల్లాకు వరం అయ్యేది. కానీ 'కూటమి' దీన్ని కాలరాసింది.

గత వైఎస్సార్ సీపీ హయాంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలు ఇలా..

శ్రీ సత్యసాయి జిల్లాలో	
విలేజ్ హెల్త్‌క్లినిక్స్‌లో నిర్వహించిన క్యాంపులు	379
ఔట్‌పేషెంట్ల నమోదు	1,49,743
వార్డు సచివాలయాల్లో క్యాంపులు	77
ఔట్‌పేషెంట్ల నమోదు	20,500
మొత్తం నిర్వహించిన క్యాంపులు	456
మొత్తం ఔట్‌పేషెంట్ల నమోదు	1,70,243
సగటున ఒక్కో క్యాంపులో ఔట్‌పేషెంట్లు	373
కంటి పరీక్షలు చేయించుకున్న వారు	32,871

శాశ్వత భవనాన్ని నిర్మించాలి



ఊటుకూరు పీహెచ్‌సీ ఏర్పాటై దాదాపు మూడేళ్లు గడుస్తోంది. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో వైద్యులు సేవలందిస్తున్నారు. ఇందులో మరుగుదొడ్డి, వాష్‌రూమ్, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల లేమి ఉంది. దీంతో పాటూ వైద్య సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు ఆస్పత్రి సిబ్బందిని నియమించాలని కోరుతున్నాము.

– విజయలక్ష్మి, ఊటుకూరు, పరిగి మండలం

ఆర్‌ఎంపీ దగ్గరకు వెళ్లాలి..

రామగిరి మండలంలోని పేరూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి 2 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడికి వైద్యులు కూడా సరిగారారు. దీనికి తోడు ఇక్కడ మందుల దొరకవు. దీంతో రోగం వస్తే వైద్యం కోసం ఆర్‌ఎంపీ డాక్టర్ల దగ్గరకు వెళ్లాల్సిందే. వారం రోజుల క్రితం వైద్యం కోసం పీహెచ్‌సీ దగ్గరకు వెళ్తే అక్కడ డాక్టర్లు ఎవ్వరూ కనిపించలేదు. దీంతో గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ దగ్గరకు వెళ్లి వైద్యం చేయించుకొన్నాను.

ముత్యాలప్ప, పేరూరు గ్రామం, రామగిరి మండలం

పడకలు లేకపోతే ఎలా?



ఈ నెల 16న మా తల్లి ఆరోగ్యం విషమించడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకువచ్చాం. అక్యూట్ మెడికల్ కేర్‌లో మంచం లేదని రెండు రోజుల పాటు ఇక్కడే ఉంచారు. ప్రాణాపాయ కేసులకు ఎప్పటికప్పుడు వార్డుకు షిఫ్ట్ చేసి సేవలందిస్తే బాగుంటుంది. రోజుల పాటు ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచితే ఎలా.. చాలి ఇబ్బందిగా ఉంది.

– తిక్కయ్య, చిగిచెర్ల గ్రామం, ధర్మవరం మండలం

జెడ్పీలో బదిలీలకు రంగం సిద్ధం

- సీఈఓ వెంకటసుబ్బయ్య పరిశీలనకు అర్హుల జాబితా
- నేడు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం ఫైల్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లా, మండల పరిషత్ సహా అనుబంధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాబితా ఇప్పటికే పూర్తి స్థాయిలో రూపొందించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ తరువాత అవకాశాన్ని బట్టి రిక్వెస్ట్ బదిలీలకు చోటు కల్పించాలని సూచించింది.

బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులు 236..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ యాజమాన్యం పరిధిలో పని చేస్తున్న వారిలో 236 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. వీరిలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు 136 మంది ఉండగా 131 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే రిక్వెస్ట్ బదిలీల కోసం ఏకంగా వంద మంది దరఖాస్తు చేసుకున్నారు. అటెండర్లలో 64 మంది ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకోగా బదిలీల కోసం 59 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

జాబితా సిద్ధం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిషత్ కార్యాలయాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎంత మందిని బదిలీ చేయవచ్చనే సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక బృందం రూపొందించిన జాబిత పరిశీలన కోసం సీఈఓ వెంకటసుబ్బయ్య టేబుల్‌పైకి గురువారం చేరింది. ఆయన జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. కొందరు అటెండర్లు పదేళ్లుగా ఒకే చోట పాతుకుపోయారు. మరి కొందరు జిల్లా కేంద్రం దాటి బయటకు పోవడం లేదు. ఇక్కడిక్కడే జెడ్పీ లేదా పీఆర్ఐ, పీఐయూ, క్యూసీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇలా ఏదో ఒక ఆఫీసుకు బదిలీ చేయించుకోవడం పరిపాటిగా మారింది. జెడ్పీలో పని చేస్తూ ఏడాది కిందట ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు తిరిగి జెడ్పీకి వచ్చేందుకు పావులు కదుపుతున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల ఇళ్లు, జెడ్పీ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇంకొందరు అనారోగ్యాన్ని సాకు చూపిస్తూ అందుకు అనుగుణంగా సర్టిఫికెట్లు సైతం సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు తుది ఆమోదం..

ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్‌ను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వద్దకు శుక్రవారం పంపనున్నారు. ఆమె పరిశీలించి ఆమోదం తెలిపిన తరువాత బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. శని లేదా ఆదివారం లోపు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగించే ఆలోచనలో జెడ్పీ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.



అందిన మొత్తం దరఖాస్తులు	236
ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు	136 మంది
ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు	ఐదుగురు
రిక్వెస్ట్ బదిలీల దరఖాస్తులు	100

కేడర్ల వారీగా అందిన దరఖాస్తులు ఇలా..

కేడర్	ఐదేళ్ల సర్వీసు పూర్తి	రిక్వెస్ట్ బదిలీ	మొత్తం
ఏఓ	--	13	13
ఎస్‌ఏ	7	16	23
జేఏ	2	29	31
రికార్డ్ అసిస్టెంట్లు	45	15	60
టైపిస్టులు	2	9	11
ల్యాబ్ అసిస్టెంట్లు	15	3	18
లైబ్రరీ అసిస్టెంట్లు	1	-	1
అటెండర్లు	59	15	79

పడిగాపులు.. చీకట్లో అగచాట్లు

- స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతుల కౌన్సెలింగ్
- ఉదయం నుంచి రాత్రిదాకా వేచిఉన్న టీచర్లు
- ఎట్టకేలకు రాత్రి 7 గంటలకు ప్రారంభమై 10 గంటలకు పూర్తి



కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు



అనంతపురం శారదా మున్సిపల్ పాఠశాలలో రాత్రి 9 గంటల సమయంలో పడిగాపులు కాస్తున్న టీచర్లు, (ఇన్‌సెట్‌లో) సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో ముందుకు వెళ్తున్న ఉపాధ్యాయిని

అనంతపురం ఎడ్యుకేషన్: హెచ్‌ఎంలుగా పదోన్నతులు తీసుకునేందుకు టీచర్లు గురువారం పడిగాపులు కాశారు. ఉదయం 11 గంటలకే శారదా నగర పాలక ఉన్నత పాఠశాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశావాహులు చేరుకున్నారు. రాష్ట్ర అధికారుల నుంచి లింక్ రాలేదు.. జాబితా సిద్ధం చేస్తున్నాం తదితర కారణాలు చెబుతూ మధ్యాహ్నం 2 గంటలకు చేపడతామని స్వయంగా డీఈఓ ప్రకటించారు. ఈ క్రమంలో అందరూ భోజనం చేసుకుని 2 గంటలలోపే అక్కడికి చేరుకున్నా అప్పటికీ ప్రారంభం కాలేదు. సాయంత్రం 4 గంటలకు అంటూ మరోమారు ప్రకటించారు. తర్వాత 6 గంటలకు అని చెప్పినా అప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన టీచర్లు పడిగాపులు కాశారు. ఎట్టకేలకు రాత్రి 7 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. రాత్రి 10 గంటలకు ముగిసింది. మొత్తం 148 హెచ్‌ఎం పోస్టులకు గాను ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన 3 పోస్టులకు ఆర్జేడీ కార్యాలయంలో పదోన్నతులు కల్పిస్తారు. తక్కిన జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించిన 145 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించారు. ఇదిలాఉండగా కౌన్సెలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. చీకటి పడిన తర్వాత వెలుతురు సరిగా లేక టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి వసతి కూడా కల్పించలేదు. ముఖ్యంగా మహిళా టీచర్లు అగచాట్లు పడ్డారు.

133 మంది హెచ్‌ఎంల బదిలీలు..

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 133 మంది ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. మొత్తం 191 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 29 మంది తప్పనిసరి బదిలీ కాగా...162 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 104 మంది బదిలీ కాగా తక్కిన 58 మంది బదిలీ కాలేదు.

ఆలస్యమైన సీనియార్టీ జాబితా..

స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన తాత్కాలిక సీనియార్టీ జాబితా శుక్రవారం విడుదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వాస్తవానికి రెండు రోజుల కిందటే జాబితా సిద్ధం కావాల్సి ఉన్నా... హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్ ఉన్న కారణగా ఆలస్యమవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు.

ఎక్కువ పాయింట్ల నమోదుపై జాగ్రత్త..

ఉపాధ్యాయుల పాయింట్ల నమోదును ఎంఈఓలు జాగ్రత్తగా పరిశీలించాలని డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రావాల్సిన పాయింట్ల కంటే ఎక్కువ వచ్చి ఉంటే అలాంటి వారితో గ్రీవెన్స్ పెట్టించి తగ్గించుకునేలా చూడాలని ఆదేశించారు. తర్వాత ఎక్కువ పాయింట్లు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే మాత్రం క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కమనీయం.. నృసింహుని కల్యాణం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య మేళ తాళాల నడుమ సంప్రదాయ పద్ధతిలో శ్రీవారి కల్యాణం జరిపించారు. స్వామివారికి పెళ్లి కానుకలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామివార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహించిన దృశ్యం

గురుకుల స్కూళ్లకు విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి విద్యార్థుల జాబితా గురువారం విడుదలైంది. విద్యార్థుల పేర్లు, వారు పొందిన మార్కులు, ఎంపికైన స్కూల్ వివరాల జాబితా గుంటూరులోని ప్రధాన కార్యాలయం నుంచి విడులైనట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ కె. జయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 3లోపు ఆయా స్కూళ్లకు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత వచ్చే అడ్మిషన్లను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. మెరిట్ జాబితాలోని తర్వాత విద్యార్థులకు ఆ సీటు కేటాయిస్తామన్నారు. ఒక గురుకులం నుంచి మరొక గురుకులానికి ఎట్టి పరిస్థితుల్లోనూ సీటు బదిలీ ఉండదన్నారు. ఎలాంటి సిఫార్సులకు అవకాశం ఉండదని కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.



పెడపల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీళ్లు

దంచికొట్టిన వర్షం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి, గోరంట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లు, గుంతల్లో నీళ్లు నిలబడ్డాయి. ఇదిలా ఉండగా.. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా అగళి మండలంలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక మడకశిర 3.6 మి.మీ., గుడిబండ 3.6 మి.మీ., హిందూపురం 2.8 మి.మీ., లేపాక్షి 2.4 మి.మీ., చిలమత్తూరు 2 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

పాతి పెట్టిన మృతదేహానికి రీ పోస్టుమార్టం

ధర్మవరం రూరల్: మండలంలోని నాగలూరు వంకలో గత ఏడాది ఏప్రిల్ 23న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. అప్పట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఎస్పీ రత్న పాత కేసుల దర్యాప్తుపై దృష్టి సారించడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన కేసులోనూ ధర్మవరం రూరల్ పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మృతుడిని పోతుకుంట గ్రామానికి చెందిన కురుబ మంజునాథ్‌గా గుర్తించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో పాతి పెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికి తీసి రీ పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికలో మంజునాథ్ ప్రమాదవశాత్తు కాకుండా హత్య కావించబడినట్లుగా నిర్ధారణ కావడంతో కొన్ని కీలక ఆధారాలను పోలీసులు సేకరించారు. ఈ నేపథ్యంలో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా డాక్టర్ పీపీ రావు



గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల, శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) డైరెక్టర్‌గా గురువారం డాక్టర్ పీపీ రావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన డాక్టర్ బాలాజీ మురారి నాందేడ్‌ను మధ్యప్రదేశ్‌లోని బుద్ని సంస్థకు బదిలీ చేశారు. కాగా, డాక్టర్ పీపీ రావు 2016 నుంచి 2022 వరకు ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత బద్నీ సంస్థకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

రాళ్ల కుప్పను ఢీకొన్న కారు

తాడిమర్రి: మండలంలోని కేఎస్ పాళ్యం వద్ద గురువారం ఓ కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో రాళ్ల కుప్పను ఢీకొంది. వివరాలు.. బెంగళూరుకు చెందిన షరీఫ్, తన ఐదుగురు మిత్రులతో కలసి కారులో గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వెళ్లారు. గురువారం తిరుగు ప్రయాణమైన వారు దారి తప్పి చిల్లకొండయ్యపల్లి వైపుగా వెళ్లారు. సాయంత్రం 6 గంటల సమయంలో కేఎస్ పాళ్యం వద్ద ప్రయాణిస్తుండగా కారుకు బ్రేక్‌లు పడడం లేదని డ్రైవర్ గుర్తించి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ రోడ్డు పక్కన ఉన్న రాళ్ల కుప్పను ఢీకొన్నాడు. దీంతో కారు ఆగిపోయింది. స్వల్ప గాయాలతో బెంగళూరు వాసులు బయటపడ్డారు.

చిత్రావతికి పర్యాటక శోభ



సీబీఆర్ వద్ద కోనసీమను తలపిస్తున్న పచ్చని పొలాలు



సీబీఆర్ వద్ద నిర్మించిన ఉద్యానవనం

- సీబీఆర్ సందర్శనకు తరలి వస్తున్న పర్యాటకులు
- ఆకర్శిస్తున్న జలాశయం, పచ్చదనం

తాడిమర్రి: మండల సరిహద్దులోని పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు పర్యాటకుల తాకిడి అధికమవుతోంది. వేసవి సెలవులు కావడంతో పాటు జలాశయంలో బోటింగ్, సీబీఆర్ ముందు భాగంలో ఉన్న పచ్చని పొలాలు పర్యాటకులను అధికంగా ఆకర్శిస్తున్నాయి.

వైఎస్సార్ ప్రత్యేక కృషితో నిర్మాణం..

మండల సరిహద్దులోని వైఎస్సార్ కడప జిల్లా, లింగాల మండలం, పార్నపల్లి మధ్య ఉన్న చిత్రావతి నదిపై 1992లో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టారు. వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, వేంపల్లి తదితర మండలాల్లో 60 వేల హెక్టార్లకు సాగు నీరు, పులివెందుల పట్టణానికి తాగునీరు, తుమ్మల యురేనియం కంపెనీ అవసరాలకు నీటిని అందించేందుకు రూ.39 కోట్ల వ్యయంతో 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పనులు నాసిరకంగా ఉన్నాయంటూ 1999లో రూ.90 కోట్లు నిధులను విడుదల చేసి గ్రావెల్ లెయర్ పనులు తిరిగి ప్రారంభించారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మరో రూ.30 కోట్లు నిధులు విడుదల చేసి సీబీఆర్ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. సీబీఆర్ లోతట్టు ప్రాంతంలో నీటి బావులను తవ్వి వాటి ద్వారా తాగునీటిని పులివెందుల, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి పట్టణాలకు అందిస్తున్నారు.



జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పర్యాటకంగా మార్చిన వైఎస్ జగన్..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీబీఆర్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. 2022లో రూ.5.50 కోట్ల నిధులను విడుదల చేసి వైఎస్సార్ లేక్‌వ్యూ పాయింట్, రెస్టారెంట్, ఉద్యానవనం, వాహనాల పార్కింగ్, జలాశయంలో విహరించడానికి బోట్లను ఏర్పాటు చేశారు. జలాశయంలో విహరించడానికి 26 మంది సామర్థ్యంతో ఒక్కొక్కరికి రూ.50 ప్రకారం డీలక్స్ బోట్, 10 మంది సామర్థ్యంతో ఒక్కొక్కరికి రూ.75 ప్రకారం పాంటూన్‌బోట్, నలుగురి సామర్థ్యంతో ఒక్కొక్కరికి రూ.150 ప్రకారం స్పీడ్‌బోట్‌లను అందుబాటులో ఉంచారు. రిజర్వాయర్ దిగువ కోనసీమను తలపించే పచ్చని పొలాలు కనువిందు చేస్తున్నాయి. దీంతో సీబీఆర్‌కు పర్యాటకుల తాకిడి పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం సెలవు రోజుల్లో 500 నుంచి 600 మంది వరకూ పర్యాటకులు వస్తున్నారు. మిగిలిన రోజుల్లో వందకు పైగా పర్యాటకులతో సీబీఆర్‌లో సందడి నెలకొని ఉంటుంది.



సీబీఆర్ వద్ద ఉద్యాన వనంలో ఆడుకుంటున్న చిన్నారులు

రెస్టారెంట్‌ను అందుబాటులోకి తేవాలి



సీబీఆర్‌ను తిలకించడానికి వచ్చే పర్యాటకుల కోసం రెస్టారెంటును అందుబాటులోకి తేవాలి. సీబీఆర్ వద్ద ప్రస్తుతం ఉన్న రెస్టారెంట్‌లో కేవలం ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు.
– గద్దె కృష్ణారెడ్డి, మద్దులచెరువు, తాడిమర్రి మండలం

ఆహ్లాదకరంగా ఉంటుంది



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సందర్శన ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. సీబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన ఉద్యానవనం, రిజర్వాయర్ దిగువన ఉన్న పచ్చని పొలాలు, జలాశయంలో బోటింగ్ మర్చిపోలేని అనుభూతులను అందిస్తున్నాయి. అయితే జలాశయం వద్ద ఉన్న రెస్టారెంట్‌లో పర్యాటకులను అనుమతించకపోవడం ఇబ్బందికరంగా ఉంది. కనీసం టీ, కాఫీ, కూల్ డ్రింక్, తిను బండారాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.
– తబ్జూల సత్యనారాయణశెట్టి, తాడిమర్రి

ప్రతిభా పురస్కారాల ప్రదానం

ధర్మవరం: కురుబ విద్యార్థులు అన్నింటా రాణించాలని యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కల్యాణ మంటపం కమిటీ అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున, మాలగుండ్ల రవీంద్ర పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన కురుబ సామాజిక విద్యార్థులకు స్థానిక కురుబ కల్యాణ మంటపంలో గురువారం ప్రతిభా పురస్కారాలను వారు అందజేసి, మాట్లాడారు. దాతల సహకారంతో పదేళ్ల క్రితం కురుబ కల్యాణ మంటపాన్ని నిర్మించామని, దీని ద్వారా వచ్చే ఆదాయంతో ఏటా పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పలు సామాజిక సేవా కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ధర్మవరం పట్టణంతోపాటు రూరల్ పరిధిలోని కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని, రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతిభగల విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుబ కల్యాణ మంటపం కమిటీ ప్రధాన కార్యదర్శి కప్పల బలరాముడు, కోశాధికారి బండి ఉజ్జినప్ప, గౌరవాధ్యక్షుడు బిల్లె నాగప్ప, ఉపాధ్యక్షులు కోటి వెంకటేష్, గిరక నారాయణస్వామి, గవ్వల నారాయణస్వామి, సూరిబాబు, బిల్లె యజ్జన్న, సహాయ కార్యదర్శి బులగొండ్ల నాగార్జున, డైరెక్టర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న కురుబ సంఘం నాయకులు

ఏక పంట విధానం వద్దు

- ఐసీఏఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్

పుట్టపర్తి అర్బన్: ఏక పంట విధానానికి రైతులు స్వస్తి పలికి పంటల సాగులో వైవిధ్యతను ప్రోత్సహించడం ద్వారా నేల ఆరోగ్యంతో పాటు రైతుల ఆదాయమూ మెరుగుపడుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.మంజునాథ్, జేడీఏ డాక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా పుట్టపర్తి మండలం పెడపల్లి, నిడిమామిడి గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన రైతు సదస్సుల్లో వారు మాట్లాడారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, వర్షపాతం, అధికారుల సలహాలు.. సూచనలు పాటించడం, ఎరువులు, మందుల పిచికారీ తదితర అంశాలు అధిక దిగుబడులపై ఆధారపడి ఉంటాయన్నారు. పంట ప్రతి దశలోనూ అధికారుల సూచనలు పాటించాలన్నారు. పంటల సాగుకు ముందు పచ్చి రొట్ట సాగు చేసి పొలంలో కలియ దున్నడం ద్వారా భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ప్రతి పంటకూ విత్తన శుద్ధి తప్పనిసరిగా ఉండాలన్నారు. వేరుశనగ, కంది, ఆముదం, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల సాగు విధానాలను వివరించారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా ఆముదం సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చునని అన్నారు. బెట్టకు తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవడం ముఖ్యమన్నారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో విత్తనాలు అందుబాటులో ఉంటాయని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు నాణ్యమైన కంది విత్తనాలను ఉచితంగా అందజేశారు. భూసార పరీక్షల కార్డులను పంపిణీ చేశారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ త్రికళ మాధవి, సెరికల్చర్ ఏడీ పద్మమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సర్పంచ్ మంగ్లీబాయి, ఏడీ సనావుల్లా, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, ఏఓ వెంకటబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ (చిత్రంలో) జేడీఏ డాక్టర్ సుబ్బారావు

మురళీనాయక్ క్రికెట్ టోర్నీ విజేత కోడూరు



మురళీనాయక్ టోర్నీ కప్‌తో కోడూరు జట్టు

చిలమత్తూరు: వీర జవాన్ మురళీనాయక్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా చిలమత్తూరు మండలం కోడూరు జట్టు నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సోమఘట్ట జట్టుపై కోడూరు జట్టు ఘన విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు ఇరు జట్లకూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో డీటీ జగన్నాథ్, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్, ప్రవీణ్‌కుమార్, అశోక్, చిన్నప్పయ్య, కోడూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కారు ఢీకొని రైతు మృతి



మృతుడు గోనుగుంట్ల ప్రతాప్

ధర్మవరం రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం చంద్రశ్చర్ల గ్రామానికి చెందిన గోనుగుంట్ల ప్రతాప్ (55), సుబ్బమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పంట రుణం రెన్యువల్ కోసమని గురువారం ఉదయం తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై మామిళ్లపల్లిలోని బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమైన వారు... 44వ జాతీయ రహదారిపై ధర్మవరం మండలం సీతారాంపల్లి సమీపంలోకి చేరుకోగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులిద్దరినీ స్థానికులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రతాప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సుబ్బమ్మకు చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపారు.

చెరువు మట్టి తరలింపులు అడ్డుకోండి



తహసీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

బత్తలపల్లి: చెరువులో మట్టి అక్రమ తరలింపులు అడ్డుకోవాలంటూ తహసీల్దార్ స్వర్ణలతకు పోట్లమర్రి గ్రామ రైతులు విన్నవించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌ను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో చెరువు మట్టిని వేల్పుమడుగు వద్ద ఉన్న పెళ్లల పరిశ్రమకు తరలించే విషయంలో ఆంజనేయస్వామి ఆలయానికి కొంత మొత్తం చెల్లించేలా గ్రామ పెద్దలు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం చెరువు మట్టిని తరలిస్తే సారవంతమైన మట్టిని రైతులు కోల్పోవాల్సి వస్తుందని గుర్తించి వెనక్కు తగ్గారన్నారు. అప్పటి నుంచి చెరువు మట్టిని గ్రామంలోని రైతులు తమ పొలాలకు మాత్రమే తరలించాలని, డబ్బులకు విక్రయించరాదని నిర్ణయించారన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ కట్టుబాటును కాదని అక్రమంగా పెళ్లల ఫ్యాక్టరీకి స్థానిక టీడీపీ నేత దేవరకొండ రామకృష్ణ రేయింబవళ్లు చెరువు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అభ్యంతరం తెలిపితే తనకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ దౌర్జన్యం చేస్తున్నాడని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమ తరలింపులు అడ్డుకోవాలని కోరారు. తహసీల్దార్‌ను కలసిన వారిలో రైతులు దామోదరరెడ్డి, రమణారెడ్డి, నాగేంద్రరెడ్డి, శివయ్య, అనంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరేష్‌రెడ్డి, మాధవరెడ్డి, నరసింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజకుళ్లాయప్ప (ఫైల్)

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన తోలు కృష్ణయ్య, సరస్వతి దంపతుల రాజకుళ్లాయప్ప (24) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కృష్ణయ్య, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, కొన్నేళ్ల క్రితమే కుటుంబ పెద్ద కృష్ణయ్య మృతి చెందాడు. అప్పటి నుంచి చిన్న కుమారుడు రాజకుళ్లాయప్ప వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతకూ రాజకుళ్లాయప్ప ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లి సరస్వతి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో మహిళ...



సావిత్రమ్మ (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని అంకంపల్లి గ్రామానికి చెందిన పాటిల్ ప్రభాకర్‌రెడ్డి భార్య సావిత్రమ్మ(60) పాము కాటుకు గురై మృతి చెందింది. గ్రామానికి సమీపంలోనే ఉన్న తమ తోటలో గురువారం ఉదయం కూలీలతో పనులు చేయిస్తున్న భర్తకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకుని సావిత్రమ్మ వెళ్లింది. ఆ సమయంలో కూలీలతో కలసి తాను కూడా కలుపు తొలగిస్తుండగా గడ్డి చాటున దాగి ఉన్న రక్త పింజరి కాటు వేసింది. వెంటనే విషయాన్ని గుర్తించిన కూలీలు పామును కట్టెలతో కొట్టి చంపేశారు. సావిత్రమ్మను ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

పెనుకొండ: పెనుకొండలో అదృశ్యమైన బాలికలు అనంతపురంలో ప్రత్యక్షమయ్యారు. వీరి సెల్ టవర్ సిగ్నల్ ఆధారంగా పసిగట్టిన పోలీసులు గురువారం తమ ఆధీనంలోకి తీసుకుని పెనుకొండ పీఎస్‌కు పిలుచుకువచ్చారు. ఎస్‌ఐ. వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... పెనుకొండలోని కుమ్మరదొడ్డిలో నివాసముంటున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, వీరు బుధవారం ఉదయం ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు హిందూపురం వెళ్లారు. అనంతరం సాయంత్రం పెనుకొండకు తిరుగు ప్రయాణమైన బాలికలు... స్థానిక బస్టాండ్‌లో బస్సు దిగకుండా నేరుగా అనంతపురానికి చేరుకుని అక్కడే ఓ హాస్టల్‌లో రెండు రోజుల అద్దె చెల్లించి ఉండిపోయారు. కుమార్తెలు ఇంటికి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించిన కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి పెనుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన పోలీసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పీఎస్‌లకు సమాచారం అందించారు. బాలికల వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆచూకీ పసిగట్టడం కష్టమైంది. గురువారం ఉదయం బాలికలు తమ సెల్‌ఫోన్‌ను ఆన్ చేశారు. దీని ద్వారా లోకేషన్ ట్రేస్ కావడంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు అక్కడకు వెళ్లి హాస్టల్ గదిలో ఉన్న బాలికలను ఆధీనంలోకి తీసుకుని స్థానిక పీఎస్‌కు పిలుచుకువచ్చారు. బాలికలతో మాట్లాడిన అనంతరం వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. తరచూ గొడవ పడుతూ బాలికలను వేధింపులకు గురి చేయడం మంచిది కాదని, ఇకపై వారిని చక్కగా చూసుకోవాలని హితవు పలికారు.

మహానాడులో జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ హల్‌చల్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కడపలో జరుగుతున్న మహానాడులో గుత్తి రైల్వే స్టేషన్ పరిధిలోని జీఆర్‌పీలో హెడ్‌కానిస్టేబుల్ వాసు హల్‌చల్ చేశాడు. మహానాడులో రెండో రోజు (28వ తేదీ) పాల్గొన్న వాసు.. టీడీపీ నేతలు ఇసురాళ్లపల్లికి చెందిన కిట్టుయాదవ్, లచ్చానుపల్లికి చెందిన రామాంజినేయులుతో ఫొటోలు దిగుతూ సందడి చేశాడు. ఓ ప్రభుత్వ ఉద్యోగి ఓ రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనడంపై ప్రస్తుతం విస్తృత చర్చ జరుగుతోంది. కాగా, ఈ నెల 11న గుత్తికి చెందిన టీడీపీ సీనియర్ నేత కోనంకి కృష్ణపై టీడీపీ కార్యాలయంలోనే వాసు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై కోనంకి కృష్ణ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అప్పటి నుంచి వాసు ప్రత్యక్షంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ టీడీపీ నేతగా చెలామణి అవుతున్నాడు.



టీడీపీ నేత హోదాలో మహానాడులో పాల్గొన్న జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వాసు

5న జాబ్ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జూన్ 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లా రెడ్డి తెలిపారు. ఎంపికైన వారు ఐఆర్‌ఈపీ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లో అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, ప్రొద్దుటూరు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, చిత్తూరు, హిందూపురం, కదిరి ప్రాంతాల్లోపనిచేయాల్సి ఉంటుంది. సేల్స్ ఆఫీసర్, సీనియర్ సేల్స్, ఆఫీస్ అడ్మిన్, కలెక్షన్ ఎక్జిక్యూటీవ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రూ.3.6 లక్షల వార్షిక వేతనం, రూ.2.4 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసి ఉండాలి. 35 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులు. ఎన్‌బీఎఫ్‌సీ, ఎంస్‌ఈ, ఎంఎస్‌ఎంఈల్లో అనుభవం తప్పనిసరి.

మంటల్లో కాలి ఆలయ పూజారి మృతి

రాప్తాడు: మండలంలోని రామినేపల్లి గ్రామానికి చెందిన హరిజన నరసింహుడు (74) బుధవారం రాత్రి మంటల్లో కాలి మృతి చెందాడు. మృతుడి సోదరి హంబ్లీ పెద్దక్క, పోలీసులు తెలిపిన మేరకు.. నరసింహుడుకు 30 ఏళ్ల క్రితం వివాహం కాగా, పెళ్లైన ఆరు నెలలకే భార్య నారాయణమ్మ ఆయనను వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మతి స్థిమితం లేక తిరిగేవాడు. రామినేపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో బంధువులు ఉన్నా కొన్నేళ్లుగా భిక్షాటనతోనే జీవనం సాగించాడు. అనంతరం 20 ఏళ్లుగా రామినేపల్లి–గొందిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న శివాలయంలో పూజలు చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. రోజూ ఆయనకు టిఫెన్, మధ్యాహ్న భోజనాన్ని అతని సోదరి హంబ్లీ పెద్దక్క, యర్రగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి సమకూర్చేవారు. గురువారం ఉదయం 7 గంటలకు పెద్దక్క కుమారుడు కేశవయ్య టిఫెన్ తీసుకుని వెళ్లిన సమయంలో అప్పటికే కాలిన గాయాలతో ఆలయం ఎదుట విగతజీవిగా పడి ఉన్న నరసింహుడు కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నరసింహుడు దుస్తులు నూనెలో అద్దినట్లుగా ఉండేవని, పైగా చూపు మందగించడంతో బుధవారం రాత్రి పక్కనే ఉంచుకున్న దీపం నుంచి మంటలు వ్యాపించి నరసింహుడిని చుట్టుముట్టి ఉంటాయనే భావించారు. మృతిపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం కావడం లేదంటూ పెద్దక్క చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.